సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 30 । జూన్ । 2023



న్యూస్‌రీల్

బురదలో కూరుకుపోయిన 108 వాహనం


వట్టిగెడ్డ వద్ద కూరుకుపోయిన వాహనం

రాజవొమ్మంగి: రోగులను తరలించేందుకు జడ్డంగి పీహెచ్‌సీకి రాజవొమ్మంగి నుంచి బయలుదేరిన 108 వాహనం గురువారం మార్గ మధ్యలో ఒట్టిగెడ్డ గ్రామ సమీపంలో రోడ్డు అంచున బురదలో కూరుకుపోయింది. దాదాపు గంటకు పైగా ఎటూ కదలకుండా నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో ఎన్‌హెచ్ 516 ఈ రహదారి నిర్మాణపనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. గురువారం తెల్లవారుజామున ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి నిర్మాణదశలో ఉన్న రోడ్డు చిత్తడిగా మారింది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. బురదలో కూరుకుపోయిన 108 వాహనాన్ని ట్రాక్టర్ సహాయంతో స్థానికులు బయటకు తీశారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అరకులోయ: స్థానిక యండపల్లివలస గిరిజన గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సాలేబు పరిష్కల (17) గురువారం ఆత్మహత్యకు యత్నించింది. గజ్జి నివారణకు ఉపయోగించే మందును తాగడంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను హుటాహుటిన గురుకుల విద్యాలయం నిర్వాహకులు అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్యం అందించారు. దీంతో ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడింది. విద్యార్థిని పరిష్కల ఆత్మహత్యాయత్నం ఘటనపై సమగ్ర విచారణ జరపాలని గిరిజన సంఘ నేతలు బాలదేవ్,రామన్న డిమాండ్ చేశారు. అరకు ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను వారు పరామర్శించారు. దీనిపై గురుకుల కళాశాలల కోఆర్డినేటర్ మూర్తిని వివరణ కోరగా ఇటీవల సప్లిమెంటరీ పరీక్ష ఎందుకు రాయలేదని ప్రశ్నించినందుకు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.

మూడేళ్లలో నలుగురికే గన్ లైసెన్సులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): గన్ లైసెన్సుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నారన్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం. త్రివిక్రమ్ వర్మ తేల్చి చెప్పారు. గురువారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 నుంచి ఇప్పటి వరకు కేవలం 15 మంది మాత్రమే లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఇందులో కేవలం నలుగురికి మాత్రమే గతంలోనే లైసెన్సులు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కూడా 2020లోనే లైసెన్సు కోసం దరఖాస్తు చేశారని, అయితే ఇప్పటి వరకు మంజూరు చేయలేదన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో కూడా సీఆర్‌పీఎఫ్ అధికారులు ముగ్గురు, మాజీ సైనికుడు ఒకరు, స్పోర్ట్స్ కోటాలో ఇద్దరు, సెల్ఫ్ డిఫెన్స్ కింద నలుగురు దరఖాస్తులు చేసుకున్నట్లు వెల్లడించారు. తాజాగా ఇద్దరు మాత్రమే లైసెన్సుల కోసం అప్లై చేశారని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తంగా 620 గన్‌లైసెన్సులు మంజూరు చేసినట్టు చెప్పారు.

4 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్టు


పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు

కొయ్యూరు: గూడెంకొత్తవీధి మండలం పెదవలస నుంచి కాకినాడ జిల్లా బూదరాళ్ల, ఏలేశ్వరం, యర్రవరం మీదుగా విజయవాడకు తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని కాకరపాడు సెంటర్‌లో గురువారం పట్టుకున్నామని ఎస్‌ఐ రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకరపాడులో వాహనాల తనిఖీల్లో భాగంగా రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి బయటపడిందన్నారు. వారిలో విజయవాడకు చెందిన లంకే ఆదిత్య, మట్టి మనోజ్, గూడెంకొత్తవీధికి చెందిన వెంకట్రావును అరెస్టు చేశామన్నారు. ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

గిరి జీవనంలో.. కాఫీ రాగం

ఏడాదికి రూ.3 లక్షల ఆదాయం



ఈ చిత్రంలోని మహిళ పేరు డిప్పల భవాని. ఈమెకు రెండు ఎకరాల కాఫీ, మిరియం తోట ఉంది. ఏడాదికి రూ.3 లక్షల మేర ఆదాయం వస్తోంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం 2007లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో ఇల్లు మంజూరైంది. కాఫీ సాగుపై వచ్చే ఆదాయాన్ని జోడించి అందమైన విశాలమైన భవనాన్ని నిర్మించుకుంది. చాలామంది రైతులు ఈమె మాదిరిగానే కాఫీ సాగులో మంచి ఆదాయం పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

- ఏటా నిలకడగా ఆదాయం
- ఆదుకుంటున్న మిరియం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం
- గిరిలో మారుతున్న పల్లెల రూపురేఖలు
- ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు


మోదాపల్లిలో కాఫీ పండ్లను సేకరిస్తున్న గిరి రైతులు (ఫైల్)

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని గిరి రైతులకు కాఫీ సాగు ఆర్థిక వనరుగా మారింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సహించడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. మన్యంలో కాఫీసాగుకు భూములు, వాతావరణం అనుకూలంగా ఉండడాన్ని గుర్తించిన కేంద్ర కాఫీబోర్డు, పాడేరు, చింతపల్లి, అరకులోయ, ఆర్‌వీ నగర్ ప్రాంతాల్లో తమ కార్యాలయాలను స్థాపించింది. 1974 నుంచి కేంద్ర కాఫీబోర్డు కాఫీ సాగును ప్రోత్సహిస్తోంది. పాడేరు ఐటీడీఏ కూడా రైతులకు అవసరమైన సహకారం అందిస్తోంది.

ఏజెన్సీలో మొట్టమొదటిగా..

ఏజెన్సీలో మొదట పాడేరు మండలం మోదాపల్లి,అరకులోయ మండలం సుంకరమెట్ట ప్రాంతాల్లో ఆదివాసీలు ప్రారంభించారు. ఆతరువాత కాలక్రమేణా 11మండలాలకు విస్తరించింది. పోడు, మెట్ట భూముల్లో సుమారు 2.27లక్షల ఎకరాల్లో సాగవుతోంది. దీనిలో సుమారు 1.42లక్షల ఎకరాల్లో ఫలసాయమిస్తోంది. మొత్తం 2,28,393 మంది రైతులు ఆధారపడ్డారు.


ఎర్రగుప్ప గ్రామంలో మహిళా కాఫీ రైతు తరడా అప్పలమ్మ నిర్మించిన భవనం

ఎకరాకు రూ.2 లక్షల మేర ఆదాయం

కాఫీ సాగుతోపాటు అంతరపంట మిరియాల ద్వారా ఎకరాకు రూ.2 లక్షల మేర ఆదాయం పొందుతున్నారు. ఏటా నిలకడగా ఆదాయం వస్తుండటంతో దాదాపు రైతులందరి ఆర్థికపరిస్థితి మెరుగుపడింది. ఒకప్పుడు పూరిగుడిసెలు మాత్రమే ఉండేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల్లో మంజూరు చేసిన ఇళ్లకు కొంత నిధులను జోడించి అన్ని సౌకర్యాలతో ఆకర్షణీయంగా నిర్మించుకున్నారు. జీవన శైలిలో కూడా ఎంతో మార్పు కనిపిస్తోంది.

ఏటా 14వేల మెట్రిక్ టన్నులు..

పాడేరు డివిజన్‌లో గిరిజన రైతులు కాఫీతోటల సాగు ద్వారా ఏటా 14వేల మెట్రిక్ టన్నుల కాఫీగింజలను ఉత్పత్తి చేస్తున్నారు.ఈఏడాది కూడా దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో పాటు కిలో కాఫీ గింజలను రూ.280 నుంచి రూ.300ధరతో అమ్ముకుని కాఫీ రైతులు మంచి లాభాలు పొందారు. కాఫీతోటల్లో అంతరపంటగా సాగవుతున్న మిరియాల పంట కూడా రైతులను ఆదుకుంటుంది. సుమారు 2 వేల టన్నుల వరకు మిరియాల అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో కిలోకు రూ.430 రికార్డు ధర లభించింది.

పోడు వ్యవసాయానికి స్వస్తి



గతంలో పోడు వ్యవసాయం చేసేవాళ్లం. ఐటీడీఏ కాఫీసాగును 30 ఏళ్ల కిందట ప్రోత్సహించడంతో కాఫీ సాగు చేపట్టాం.ఐదెకరాల కాఫీ తోటల ద్వారా 20ఏళ్ల నుంచి మంచి ఆదాయం పొందుతున్నాం. మంచి ఇల్లు నిర్మించుకున్నాం. గత సీజన్‌లో రూ.7లక్షల వరకు ఆదాయం వచ్చింది. **– తరడా అప్పలమ్మ,** కాఫీ రైతు, ఎర్రగుప్ప, పాడేరు మండలం

కాఫీ సాగును విస్తరిస్తాం



ఏజెన్సీలో కాఫీతోటల సాగును మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రానున్న పదేళ్లలో మరో లక్ష ఎకరాల కాఫీతోటల విస్తరణ లక్ష్యంగా ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపాం. కాఫీ సాగుతో గిరిజనులు ఆర్థికంగా నిలదొక్కుకోవడం శుభపరిణామం

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

కాఫీ సాగు వివరాలు

మండలం	రైతులు	తోటలు (ఎకరాల్లో)
గూడెంకొత్తవీధి	35,139	38,600
జి.మాడుగుల	33,688	34,384
చింతపల్లి	31,194	33.348.50
పాడేరు	22,048	22,424
హుకుంపేట	19,281	19,705.50
డుంబ్రిగుడ	16,858	15,926
పెదబయలు	15,094	14,819
ముంచంగిపుట్టు	13,699	11,050.50
అరకులోయ	13,287	13.479
అనంతగిరి	11,687	12,657.50
కొయ్యూరు	6,418	10,627

వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల ఇన్‌ఛార్జులు వీరే

సాక్షి,పాడేరు: జిల్లాలోని 22 మండలాలకు వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌ఛార్జిల జాబితాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసింది.

పాడేరు నియోజకవర్గం: పాంగి గాన్‌బాబు (చింతపల్లి), లెంకల కల్యాణ్ (జి.మాడుగుల), పోతురాజు కృష్ణమూర్తి (గూడెం కొత్తవీధి), బండి సుధాకర్ (కొయ్యూరు), పలాసి కోటేశ్వరరావు (పాడేరు).

అరకులోయ నియోజకవర్గం: పట్టాసి సంపత్‌కుమార్ (అరకు), సురబోయిన నవీన్ (అనంతగిరి), కొర్రా గణపతి (డుంబ్రిగుడ), కిల్లో రామకృష్ణ (హుకుంపేట), వి.కొండలరావు (ముంచంగిపుట్టు), గంపరాయి అజయ్‌కుమార్ (పెదబయలు).

రంపచోడవరం నియోజకవర్గం: నక్కా వీర్రాజు (అడ్డతీగల), కొట్ల కృష్ణ (చింతూరు), కందుల బ్రహ్మాజీరావు (దేవీపట్నం), మొగంటి శ్రీను (గంగవరం), ఆవుల మరియాదాస్ (కూనవరం), గొర్లె అనిల్‌ప్రసాద్ (మారేడుమిల్లి), కొంగర మురళీకృష్ణ (రాజవొమ్మంగి), పండ రామకృష్ణ (రంపచోడవరం), బొడ్డు సత్యనారాయణ (వీఆర్‌పురం), కరణం కనకరాజు (వై.రామవరం), గొను ప్రశాంత్ (ఎటపాక) నియమితులయ్యారు.

శేషపాన్పుపై జగన్నాథుడు

డాబాగార్డెన్స్: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం స్వామి శేష పాన్పుపై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామిని మేల్కొలిపారు. ప్రార్థనా తరంగిణి, సామూహిక లలితా సహస్రనామ పారాయణ జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. చివరి రోజు కావడంతో స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నగరం, జిల్లా నలుమూలల నుంచి భక్తుల తాకిడితో ప్రాంగణమంతా కిక్కిరిసింది. గుండిచా మందిరంలో 10 రోజులు కొలువైన జగన్నాథుడు సోదరీ సోదరులు వెంటరాగా శుక్రవారం తిరుగు పయనం కానున్నారు.

జగనన్న సురక్షలో 11 రకాల సేవలు

- రేపటి నుంచి గ్రామ సచివాలయాల్లో శిబిరాల నిర్వహణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్



సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న సురక్ష పథకంలో 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలకు సంబంధించి గ్రామ వలంటీర్లు ఇప్పటికే ఇంటింటా తిరిగి సర్వే నిర్వహించారన్నారు. వీటి ఆధారంగా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల ఆధారంగా షెడ్యూల్ ప్రకారం సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసే ప్రత్యేక శిబిరాల్లో ధ్రువపత్రాలు అందజేస్తారని ఆయన తెలిపారు. ప్రతీ మండలానికి తహసీల్దార్, ఎంపీడీవోలు వేర్వేరుగా రెండు బృందాలుగా ఏర్పడి సేవలు అందిస్తారన్నారు. వీరిపై పర్యవేక్షణకు జిల్లా అధికారులను మండల ప్రత్యేకాధికారిగా నియమించామన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో సేవలు అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

శిబిరాల వివరాలు: అడ్డతీగల మండలంలోని అడ్డతీగల, అరకులోయ మండలంలో చినలబుడు,పెదలబుడు-3, చింతపల్లి మండలంలో అంజలి శనివారం, బలపం, చింతూరు మండలం పరిధిలో ఏడుగురాళ్లపల్లి,పేగ, గూడెం కొత్తవీధి మండలంలో జీకేవీధి-1, జీకే వీధి-2, హుకుంపేట మండలంలో బాకూరు, రాప, కొయ్యూరు మండలంలో డౌనూరు,రావణాపల్లి, ముంచంగిపుట్టులో బంగారుమెట్ట, కించాయిపుట్టు, రాజవొమ్మంగి మండలంలో బడదానంపల్లి, శరభవరం, వీఆర్‌పురం మండలంలో రేఖపల్లి, వై.రామవరం మండలంలో చవిటదిబ్బలు గ్రామ సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తారు. ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

'నిర్వాసిత గ్రామాలుగా గుర్తించాలి'

సాక్షి, అమరావతి: గోదావరి వరద తాకిడికి గురవుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని అన్ని గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. లేఖను గురువారం శ్రీనివాసరావు మీడియాకు విడుదల చేశారు. రైతులు, ఇతర పేదలపై భారం మోపేలా ఉన్న కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలను రాష్ట్రప్రభుత్వం తిరస్కరించాలని శ్రీనివాసరావు వేరొక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అదనపు రుణం మంజూరు చేయాలంటే తాను ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం షరతులు పెట్టడం దారుణమని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ కుటిల ప్రయత్నాలను వ్యతిరేకించాలని, ఉచిత, రాయితీ విద్యుత్ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


పాడేరులోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

సాక్షి, పాడేరు: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ముస్లింలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని పురాతన మసీదులో ఉదయాన్నే అల్లాహ్‌కు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మసీదు గురువు మహమ్మద్ అలీ నమాజ్ చేశారు.అలాగే మసీదు ఆవరణలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయ సమీపంలోని తమిళనాడు ముస్లిం కుటుంబాలకు చెందిన జమాత్ మసీదు, గుత్తులపుట్టులోని మసీదుల వద్ద ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అరకులోయ: స్థానిక మసీదు వద్ద, హుకుంపేటలో బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు

ఎస్‌ఈ మహేంద్ర


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేంద్ర

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేంద్ర ఆదేశించారు. గురువారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన సదర్శించారు. వినియోగ దారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సక్రమంగా సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరా నిలిచి పోయినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు వినియోగదారులు సమాచారం అందించాలని సూచించారు. చింతపల్లిలో 220 కేవీ యార్డ్ ఏర్పాటు చేస్తామన్నారు. చింతపల్లి లేదా జీకే వీధిలో స్థల సేకరణ చేస్తామన్నారు. ఎస్టీ, ఎస్సీలు, ప్రభుత్వ ఉద్యోగులు విద్యుత్ బిల్లులు చెల్లించాలని సూచించారు. గిరిజనులు ప్రభుత్వ రాయితీ పొందేందుకు సచివాలయాలను ఆశ్రయించాలన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు విద్యుత్‌పై అవగాహన కల్పించారు. అనంతరం లోతుగెడ్డ, పెదవలస ప్రాంతాల్లో పర్యటించి వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ తప్పడంతో పరార్

- ముగ్గురు విద్యార్థులను హైదరాబాద్ నుంచి విశాఖ తీసుకొచ్చిన పోలీసులు
- తల్లిదండ్రులకు అప్పగింత
- వివరాలు వెల్లడించిన సీపీ త్రివిక్రమ్ వర్మ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): ముగ్గురు విద్యార్థులు ఇంటర్‌లో కొన్ని సబెక్టులు ఫెయిల్ అయ్యారు. తల్లిదండ్రులు మందలిస్తారని భావించారు. ఇంటి నుంచి వెళ్లిపోయి పానీ పూరీ షాపు లేదా ఏదైనా వ్యాపార సముదాయంలో గానీ పనిచేద్దామని పరారయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మూడు బృందాలతో దర్యాప్తు చేపట్టగా వారు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులను అక్కడి నుంచి సురక్షితంగా తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ తెలిపారు. గురువారం పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. గాజువాకకు చెందిన దిలీప్ (16), జి.ఉమేష్ పవన్(16), ఉపాద బాబి (16) పాత గాజువాక ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరు కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు. తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో ఇంటి నుంచి దూరంగా వెళ్లిపోయి ఏదైనా పనిచేసుకోవాలని భావించారు. దీంతో ఈ నెల 25న కాలేజీకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పిన వీరు ముందు కె.కోటపాడులో ఉన్న దిలీప్ ఇంటికి వెళ్లారు. కొంత సేపటి తరువాత అక్కడి నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చి తిరువనంతపురం రైలు ఎక్కారు.

మూడు బృందాలతో గాలింపు

తమ పిల్లలు ఇంటికి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. విద్యార్థుల వద్ద ఫోన్ లేకపోవడంతో వారిని ట్రేస్ చేయడం కష్టంగా మారింది. ఇదిలా ఉంటే విద్యార్థులు తిరువనంతపురం నుంచి సికింద్రాబాద్‌రైల్వేస్టేషన్‌కు వచ్చారు. వారు తీసుకువెళ్లిన డబ్బులు అయిపోవడంతో వారి కోసం తల్లిదండ్రులు ఏం అనుకుంటున్నారో తెలుసుకోవాలని భావించి అక్కడున్న ఓ వ్యక్తి ఫోన్ తీసుకున్న విద్యార్థి అతని సోదరుడికి ఫోన్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ నంబర్ సిగ్నల్స్ ఆధారంగా వారు సికింద్రాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఫోన్‌గల వ్యక్తితోపాటు విద్యార్థుల్లో ఒకరి మేనమామ కూడా సికింద్రాబాద్‌లోనే ఉన్నట్టు పోలీసులు తెలుసుకున్నారు. దీంతో వీరిద్దరికి విషయం చెప్పి...విద్యార్థులను సమీపం జీఆర్‌పీ పోలీసులకు సమాచారమందించాలని ఇక్కడ పోలీసులు సూచించారు. ఈ మేరకు విద్యార్థులను జీఆర్‌పీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గాజువాక పోలీసులు సికింద్రాబాద్‌కు వెళ్లి విద్యార్థులను తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇందులో ఎవరి కుట్రకోణం లేదని సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. కేసును ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

గంగవరం పోర్టు వివాదంపై చర్చలు

గంగవరం పోర్టులో పరిస్థితి అదుపులోనే ఉందని సీపీ తెలిపారు. అది కేవలం యాజమాన్యం, కార్మికుల మధ్య ఉద్యోగ, వేతన ఒప్పందం విషయంలో కొంత వివాదం నెలకొందని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. అందులో తీసుకున్న నిర్ణయాలపై కొంత మంది అంగీకారం తెలిపితే.. కొంత మంది వ్యతిరేకించినట్లు చెప్పారు. ఈ వ్యవహారం జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందన్నారు. ఈ నేపథ్యంలో పోర్టు కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు.

గిరి ప్రదక్షిణకు పటిష్ట బందోబస్తు

దొండపర్తి (విశాఖ దక్షిణ): గిరి ప్రదక్షిణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానంగా కొండపైన, కిందన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కొండపైన బస్‌స్టేషన్‌కు బఫర్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రయాణికులతో పాటు బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఉండవన్నారు. అలాగే గిరిప్రదక్షిణ చేసే భక్తులు కొబ్బరికాయలు కట్టేందుకు అందరూ తొలిపావంచ వద్దకు రావడంతో రద్దీ ఏర్పడుతోందని, దీంతో కొత్త ఘాట్ రోడ్డులో కూడా తొలి పావంచ వద్ద ఉన్నట్లే కొబ్బరికాయ కట్టేందుకే కాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఫలితంగా హనుమంతవాక, శొంత్యాం నుంచి వచ్చే భక్తులు కొత్త ఘాట్ రోడ్డు వద్దే కొబ్బరికాయ కొట్టి ప్రదక్షిణ ప్రారంభించడంతో కొంత రద్దీ తగ్గుతుందన్నారు. అలాగే ప్రదక్షిణ మధ్యలో అప్పూఘర్ వద్ద భక్తులు స్నానాలు చేసే అవకాశం ఉన్నందున అక్కడ ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా స్విమ్మర్లతో పాటు డ్రోన్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగానికి ప్రతి అరకిలోమీటర్‌కు ఒక పోలీస్ వాహనం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ-2 ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఎఫ్‌జీడీ సిస్టమ్ ప్రారంభం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్‌జీడీ (ఫ్లూగ్యాస్ డీసర్ఫ్‌రైజేషన్) సిస్టమ్‌ను సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా గురువారం ప్రారంభించారు. సంస్థలో నాలుగో యూనిట్ 300 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తున్న సమయంలో ఈ నూతన ఎఫ్‌జీడీ సిస్టమ్‌ను ఏర్పాటు చే శారు. ఈ సిస్టమ్ వలన ఫ్లూగ్యాస్‌లోని సల్ఫర్‌డయాక్సైడ్ రిమూవ్ చేయడం ద్వారా ఎన్విరాన్‌మెంట్‌కు ప్రయోజనం కలుగుతుందని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓఅండ్‌ఎం జీఎం డీపీ పాత్ర, ప్రాజెక్టు జీఎం సంతోష్‌కుమార్ ఝా, శ్రీమాధ్యూ (జీఎం), ఆపరేషన్ జీఎం టి.ఆర్.రాజగోపాలన్, జీఎం కె.జగన్‌మోహన్‌రావు, జీఎం ఎస్.పద్మప్రియ, హెచ్‌వో హెచ్‌ఆర్ రూమాడి శర్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొండంత పచ్చదనం


వేసవిలో ఆకులు రాల్చి..

అనంతగిరి మండలం బోడగుడ వద్ద వేసవిలో ఆకులురాల్చిన చెట్లతో కనిపించిన ఓ కొండ ఇప్పుడు పచ్చదనంతో కనువిందు చేస్తోంది.


నేడు పచ్చదనంతో..

మన్యంలో కురుస్తున్న వర్షాలకు చిగురించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. – అనంతగిరి

క్లుప్తంగా

హుద్‌హుద్ నష్టం అవకతవకలపై 51బి విచారణ చేశాం

- రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ వెంకట్రావు వెల్లడి



చోడవరం : హుద్‌హుద్ తుఫాన్ సమయంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి జరిగిన నష్టంలో అవకతవకలపై 51బి విచారణ జరిపినట్టు రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ బి. వెంకట్రావు చెప్పారు. ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత మహాజనసభలో సభ్యుల తీర్మాణం మేరకు హుద్‌హుద్ తుఫాన్ నష్టంలో అవకతవకలు, మొలాసిస్ అమ్మకాల్లో వచ్చిన ఆరోపణలపై ప్రత్యేక కమిటీలో అంతర్గత విచారణ జరిపినట్టు కమిషనర్ చెప్పారు. హుద్‌హుద్ తుఫాన్ నష్టంపై ఇప్పటికే గతంలో మూడు దశల్లో విచారణ చేయడం, వచ్చిన నివేదికపై చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అయితే ఆ విచారణ కమిటీల్లో జేసీ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ సిఫారసు మేరకు మరో సారి 51బి శాఖాపరమైన విచారణ చేయడం జరిగిందని, నివేదిక ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకట్రావు చెప్పారు. సహకార రంగంలో నడుస్తున్న ఏకైక ఫ్యాక్టరీ అయిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి చేసేందుకు, రైతుల చెరకు బకాయిలు చెల్లించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు.

తేనెటీగల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి: మండలంలోని చావడికోట పంచాయతీ పరిధి బొడ్లంక గ్రామంలో తేనెటీగల దాడిలో గురువారం ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పి. రాజిరెడ్డి కొండపోడు పోలం వద్ద కట్టెలు కొడుతుండగా అతనిపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో తీవ్ర గాయాలు కావడంతో బంధువులు బోదులూరు పీహెచ్‌సీకి తరలించగా, అక్కడ నుంచి రంపచోడవరం ఆస్పత్రికి తరలించారు.

ఇథనాల్ పరిశ్రమతో 'గోవాడ' స్వయం సమృద్ధి

- సమీక్షలో రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, రాష్ట్ర కేన్ కమిషనర్ వెంకట్రావు



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, రాష్ట్ర కేన్ కమిషనర్ వెంకట్రావు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని స్వయం సమృద్ధితో నడిచేలా చేసేందుకు ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సహకార రంగంలో నడుస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ, ప్రస్తుత పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఉన్నతాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జిల్లా కలెక్టర్, ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జి రవి సుభాష్ పట్టాన్‌శెట్టి, రాష్ట్ర కేన్ కమిషనర్ వి. వెంకట్రావు, ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ సన్యాసినాయుడు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఫ్యాక్టరీ కేన్ క్యారీయర్, బాయిలర్ యూనిట్, కో జనరేషన్ ప్లాంట్‌లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర సహకార రంగంలో నడుస్తున్న ఏకైక ఫ్యాక్టరీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అన్నారు. ఈ ఫ్యాక్టరీని ఆధునికీకరించడం ద్వారా పరిశ్రమను కాపాడడంతోపాటు చెరకు రైతులకు, కార్మికులకు మేలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉప ఉత్పత్తుల యూనిట్ అదనంగా ఏర్పాటు చేస్తేనే ఫ్యాక్టరీకి మనుగడ ఉంటుందని భావిస్తున్నామని, ఇదే విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దేశంలో ఇథనాల్‌కు చాలా డిమాండ్ ఉందని, 1300 కోట్ల లీటర్ల ఇథనాల్ అవసరం కాగా ఇంకా 700 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి అవసరం ఉందని చెప్పారు. అందుకు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో దేశంలో ఇథనాల్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుకూలంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని గోవాడ ఫ్యాక్టరీలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే 60 కోట్ల లీటర్ల కెపాసిటీ కలిగిన ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ఇప్పటికే పర్యావరణ అనుమతులు కూడా ఇవ్వడంతో ఈ పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కెపాసిటీని దశలవారీగా విస్తరించే విధంగా ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు రూ.95 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. దీనికి బ్యాంక్ గ్యారెంటీతో పాటు 10శాతం ఫ్యాక్టరీ వాటా ధనాన్ని కూడా ప్రభుత్వమే సమకూర్చే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆమోదం తెలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రభుత్వ గ్యారెంటీతో రూ.67 కోట్లు, గ్రాంట్‌గా మరో రూ.16 కోట్లు ఇప్పటి వరకూ ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వం భరించి, ప్రభుత్వ షేర్ ధనంగా ఫ్యాక్టరీకి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇదిలావుండగా కొత్తగా రైతుల చెరకు బకాయిలు, ఈ సీజన్ క్రషింగ్ ఓవర్ హాలింగ్ పనులు, ఇతర అవసరాల నిమిత్తం మరో రూ. 23 కోట్లు అవసరమని యాజమాన్యం కోరడంతో ఈ నిధులు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి చెప్పారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ సహకార సుగర్ ఫ్యాక్టరీలను పూర్తిగా నిర్వీర్యం చేసింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు.

మహానేత రాజశేఖరరెడ్డి హయాంలో ఫ్యాక్టరీని ఆదుకుంటే, మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా అడుగులు వేశారన్నారు. గోవాడ ఫ్యాక్టరీని రూ.170 కోట్ల అప్పుల ఊబిలోంచి రక్షించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 80 కోట్లు వరకూ సాయం అందించారన్నారు. జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి మాట్లాడుతూ ఫ్యాక్టరీ, రైతుల సంక్షేమంపై మంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్షలో చర్చించడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఫ్యాక్టరీ ఓవర్‌హాలింగ్ పనులపై ఎంత ఖర్చు పెట్టాలనే అంశంపై ముందస్తు ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రైతుల బకాయిలు త్వరలోనే చెల్లించేందుకు చర్యలు చేట్టామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు, ఫీల్డు సిబ్బంది పాల్గొన్నారు.

పులకించిన గరుడాద్రి

- భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు
- ఉపమాక వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం

నక్కపల్లి : తొలి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారు జామున మూడు గంటలకు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షనపల్లి కృష్ణమాచార్యులు, పి.వి. శేషాచార్యుల ఆధ్వర్యంలో గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవ మూర్తులు, గోదాదేవి సన్నిధిలో నిత్యార్చనలు అభిషేకాలు విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని, విష్వక్సేనుల వారిని నూతన వస్త్రాలు, సర్వాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తొలి ఏకాదశి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ ప్రధాన గోపురం, బేడామండపం, ఆస్థాన మండపాల చుట్టూ బారులు తీరి క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి మూలవిరాట్‌ను మెట్లమార్గంలో వెళ్లి దర్శించుకున్నారు.

పలువురు భక్తులు స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ వారు ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోలాట బృందాలు కోలాటం ప్రదర్శించారు. సాయంత్రం శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ, భజన కార్యక్రమాలు జరిగాయి. వేకువ జామున జరిగిన అభిషేకంలో ఏపీయుఎఫ్‌ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కశింకోట : మండలంలోని బయ్యవరం-నరసింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి గురువారం అక్కడికక్కడే మృతి చెందినట్టు తుని రైల్వే ఇన్‌ఛార్జి ఎస్ఐ లోవరాజు తెలిపారు. మృతుని పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు. గత మూడేళ్లగా రైలు పట్టాలపై వాటర్ ఖాళీ బాటిళ్లు ఏరుకొని అమ్ముకొని జీవనం సాగిస్తూ ఇక్కడి రైలు వంతెన కింద నివాసం ఉండేవాడని స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచామన్నా రు. మృతుని వివరాలు తెలిసిన వా రు, కుటుంబ సభ్యు లు, బంధువులు తుని రైల్వే పోలీసుస్టేషన్‌లో తమను సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

- ముషిడిపల్లి యువకుడి మృతి
- వేపాడ మండలం సంజీవ మెట్ట వద్ద ప్రమాదం



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు ముందు భాగం (ఇన్‌సెట్) ధ్వంసమైన ద్విచక్ర వాహనం



అపస్మారక స్థితిలో ఉన్న రావాడ లక్ష్మణరావును 108 కేజీహెచ్‌కు తరలిస్తున్న స్థానికులు (ఇన్‌సెట్) మృతుడు లక్ష్మణరావు(ఫైల్)

దేవరాపల్లి : దేవరాపల్లి-వావిలపాడు రోడ్డులో సంజీవమెట్ట వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గ్రామ శివారు రావాడపాలేనికి చెందిన రావాడ లక్ష్మణరావు(22) మృతి చెందాడు. వేపాడ మండలం సంజీవమెట్టలోని తన బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై రోడ్డు మలుపు తిరుగుతున్న లక్ష్మణరావును వెనుక వావిలపాడు జంక్షన్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో లక్ష్మణరావుకు తలపైన బలమైన గాయం కాగా రెండు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మణరావును 108 వాహనంలో దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు.

ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జు కాగా ద్విచక్ర వాహనం సైతం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన ప్రాంతం విజయనగరం జిల్లా వేపాడ మండలం పోలీస్‌స్టేషన్ పరిధి కావడంతో అక్కడి పోలీసులకు మృతుడి బంధువులు సమాచారం అందించారు.

ముషిడిపల్లిలో విషాద ఛాయలు

కవలల్లో ఒక్కరైన లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామం ముషిడిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మేనత్త ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన తన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తల్లిదండ్రులు సూరిబాబు, శ్రీరాములు భోరున విలపించారు. చేతికి అంది వచ్చిన కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. చిన్నకుమారుడైన లక్ష్మణరావు తమకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటూ వెల్డింగ్ పని చేస్తుండేవాడని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు ఇద్దరు కవల పిల్లలతో పాటు కుమార్తె ఉందని మృతుడి తల్లిదండ్రులు సూరిబాబు, శ్రీరాములు తెలిపారు.

విదేశీ యువతులపై దాడి కేసులో నిందితుడికి రిమాండ్

ఆరిలోవ: ఆదర్శనగర్‌లోని లాడ్జీలో థాయ్‌లాండ్ యువతులపై చేయిచేసుకున్న వ్యక్తిని ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 8న లాడ్జీలో ఉన్న థాయ్‌లాండ్‌కు చెందిన ఇద్దరు యువతులు, విశాఖకు చెందిన మరో యువతిపై సురవరపు మహేష్ చేయిచేసుకున్నాడు. దీంతో వారు సీపీకి ఫిర్యాదు చేయడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ లాడ్జీపై దాడి చేశారు. అక్కడి నుంచి పరారైన మహేష్‌ను రెండు రోజుల తర్వాత శ్రీకాకుళం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహేష్‌ను అక్కడ పోలీసులు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. అతని ఆరోగ్యం కుదుటపడటంతో బుధవారం శ్రీకాకుళం నుంచి విశాఖ తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. కోర్టు రిమాండ్ విధించడంతో అతన్ని విశాఖ కేంద్ర కారాగారానికి తరలించామన్నారు. నిందితుడి స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం యశోదనగర్. అతనిపై గతంలో పలు కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం : గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ రామారావు తెలిపారు. గబ్బాడ వంతెన వద్ద గురువారం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చింతపల్లి వైపు నుంచి నర్సీపట్నం వస్తున్న టాటా సుమో వాహనాన్ని తనిఖీ చేయడంతో గంజాయి బయటపడింది. గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన గాసిరం ఖార(25), రాజేంద్రసింగ్(30), చంద్ర బడనాయక్(23)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కారులోని 96 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

'నేను ఆ గుంపులో లేను' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ జంగాలయ్య

సీతంపేట: యువ రచయిత హరి కుమార్ రచించిన 'ఐ యామ్ నాట్ ఇన్ దట్ ఫ్లాక్ (నేను ఆ గుంపులో లేను) పుస్తకావిష్కరణ విశాఖ పౌరగ్రంథాలయంలో జరిగింది. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ సభాధ్యక్షతన గురువారం జరిగిన సభలో విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ ఎన్. జంగాలయ్య ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరికుమార్ చిన్న వయసులోనే తన ఆలోచనలు, భావనలను పుస్తక రూపంలోకి తీసుకొచ్చి యువతరానికి స్ఫూర్తినిచ్చాడన్నారు. యువ రచయిత అయినప్పటికీ తన రచనా శైలి, పద ప్రయోగం చక్కగా ఆకట్టుకుంటోందన్నారు. భవిష్యత్‌లో మంచి కవిగా రాణించాలని ఆకాంక్షించారు.

శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో యువ రచయితల ప్రవేశం, కొత్త భావావిష్కరణల అవసరం ఎంతైనా ఉందన్నారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేస్తూ హరికుమార్ తన రచనలో కొత్త ఆలోచనను చొప్పించారని కొనియాడారు. తన అధ్యయనంతో భవిష్యత్‌లో మంచి రచనలు చేసే అవకాశం ఉందన్నారు. రచయిత్రి ఉమా గాంధీ, సీఐటీయూ నాయకురాలు పి.మణి పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

- ప్రమాదం చూసి భీతిల్లిన ప్రజలు
- సురక్షితంగా బయటపడిన కుటుంబ సభ్యులు



లారీ ఢీకొనడంతో పల్టీలు కొట్టిన కారు

గోపాలపట్నం: జాతీయ రహదారిపై కాకానినగర్ సమీపంలోని పంజాబీ దాబా వద్ద కారును లారీ ఢీ కొట్టింది. కారు పల్టీలు కొట్టగా.. అందులో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. దొండపర్తి ప్రాంతానికి చెందిన దూరి రమణ తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కారులో తుని సమీపంలోని తలుపులమ్మ లోవ దైవదర్శనానికి బయలుదేరారు. కాకానినగర్ పంజాబీ దాబా వద్దకు రాగానే వెనుకనే వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో కారు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న రమణకు స్వల్ప గాయాలయ్యాయి. మిగతా కుటుంబ సభ్యులంతా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఎయిర్ పోర్టు, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కారును తొలగించారు. గాయపడిన రమణను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం చూసి భీతిల్లిన ప్రజలు.. ఎవరికీ ఏం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. లారీడ్రైవర్‌ను ఎయిర్ పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఒకరిపై బీరు బాటిళ్లతో దాడి

- ప్రేమ వ్యవహారమే కారణం?
- యువతి అన్నయ్యే దాడి చేసినట్లు సమాచారం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక మార్కెట్‌లో ఓ వ్యక్తిపై కొందరు బీరు బాటిళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలివీ.. కణితి రోడ్డుకు చెందిన కాండ్రెగుల శ్రీనివాస్ సొంతంగా పూజా సామగ్రి షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా శ్రీనివాస్‌పై బీరు బాటిళ్లతో దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా.. ప్రేమ వ్యవహారమే ఈ దాడికి కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సీఐ తెలిపారు. శ్రీనివాస్, ఓ యువతి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని, వీరి ప్రేమను ఆమె అన్నయ్య వ్యతిరేకిస్తున్నాడని చెప్పారు. ఆమెతో చాటింగ్‌లు చేయడం వంటి వ్యవహారాలు నచ్చకపోవడంతో శ్రీనివాస్‌పై వినయ్ అనే రౌడీ షీటర్‌తో దాడి చేసినట్లు సమాచారం. పరారీలో ఉన్న రౌడీషీటర్ వినయ్ పట్టుకుని విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సీఐ వెల్లడించారు.